# చూపున్న మనిషి

యమ్మ్య రామిరెడ్డి



సికింద్రాబాదు స్టేషన్లో బండి దిగి, బ్యాగ్ భుజానికి తగిలించుకొని బయటికి నడిచాను. స్టేషన్ లోపలా, బయటా ఒకటే హడావుడి. జనం.....జనం. ఎవరి పనులు వారివి. ఎవరి పరుగులు వారివి.

మెయిన్ గేటు దాటి కుడివైపు తిరిగాను. ఎడమ వైపు రెండు బస్టాపులున్నాయి. అక్కడికి వచ్చే, పోయే బస్సుల్తో మెయిన్ రోడ్ బిజీగా వుంది. వాటికి తోడు కార్లు, జీపులు, బైక్‌లు, ఆటోలు, రిక్షాలు, సైకిళ్లు. రోడ్డు కిరువైపులా బాలలు, యువకులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు, బిచ్చగాళ్ళు; వర్తకుల పళ్ళ బండ్లు, రకరకాల వస్తువులు గుట్టలుగా పోసిన - వ్యాపారుల అరుపులు, అమ్మకం కోసం పుట్‌పాత్ మీద ప్రదర్శనకు పెట్టిన రెడీమేడ్ బట్టలూ! కొందరూ అదే అలవాటైన చర్యలా అలవోకగా రోడ్డు దాటుతుంటే,మరికొందరు అదో ప్రాణసంకటమైన పనిలా తంటాలు పడుతున్నారు.

రెండు కళ్ళనూ అప్రమత్తం చేసుకొని త్వరితగతిన మెదడుకు సంకేతాలు పంపకపోతే - ఎదురుగా ధీమాగా కుడివైపున నడచి వచ్చే కుస్తీ యోధుడి డాష్‌కో, స్లో కాగానే బస్సు గేటులోంచి పిడుగులా జారిపడే జిమ్నాస్టిక్ ప్రాక్టీషనర్ ఫీట్‌కో, అర్ధగజం జాగా దొరికితే ఆత్రంగా దూనుకుపోయే ఆటో రిక్షా బాక్సింగ్‌కో భలకాక తప్పదు!

ఆరోడ్డు మీద నడుస్తోంటే శాంతి నావాసం లోంచి శాసనసభ సమావేశంలోకి వచ్చి పడ్డట్టుంది నాకు. మొత్తానికి 'మైకు'ల దెబ్బలు తినకుండానే పదహారో నెంబర్ బస్టాప్‌కి చేరుకున్నాను.

ఎత్తుగా, బాగా పొడవుగా కట్టబడిన ఆ బస్టాండు లోపలి భాగంలో మూడు స్టేజీలూ, బయట మూడూ వున్నాయి. లోపలి మొదటి స్టేజీలో పదహారు ఆగుతుంది. ఎప్పుడో రెండు మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చేవాణ్ని కాబట్టి మిగతా స్టాపుల్లో ఏ రూటు బస్సులు ఆగుతాయో తెలీదు.

సాయంత్రం అయిదు కావస్తోంది. స్కూలు పిల్లలు, కాలేజి స్టూడెంట్స్, ఉద్యోగస్తులు, మార్కెట్ చేసుకొని ఇళ్ళకు బయల్దేరిన వాళ్ళు, సినిమాలకెళ్ళి తిరిగొచ్చే జనం, దూరప్రాంతాల్నుండీ రైలుకొచ్చిన వాళ్ళు - ఎవరికి వాళ్ళు అర్జెంటుగా ఇంటికి చేరుకోవాలని ఆత్రంగా, ఆశగా ఎదురు చూస్తున్నారు. బస్సులు వస్తున్నాయ్, పోతున్నాయ్. జనం మాత్రం తరగటం లేదు.

హఠాత్తుగా నా దృష్టి దూరం నుంచీ నడిచొస్తున్న ఓ ముసలావిడపై పడింది. ఓ చేతిలో కూరగాయల సంచి, మరో చేతిలో కర్ర! ప్రాణమిత్రుడి చేతిని పట్టుకున్నట్టు కర్రను గట్టిగా పట్టుకు నడుస్తోంది. కర్ర సాయం - వృద్ధాప్యం వల్ల నడవలేక కాదు, పుట్టినప్పట్నుంచీ కళ్ళు తమ డ్యూటీ నిర్వర్తించమని మొరాయించటం వల్ల. తను అంధురాలినన్న స్పృహే లేనట్లు చాల చాకచక్యంగా ట్రాఫిక్ లోంచి నడచి వస్తోంది.

నేను నించున్న ప్లాట్‌ఫాం మీదికే వచ్చిందావిడ. ఎదురుగా ఏ అడ్డం నిలబడి వుందోనని కర్రతో తడుముకుంటూ, మనుషుల్ని తప్పించుకుంటూ ముందుకొచ్చి, ఓ చోట నిలబడి "బాబూ నలభైయ్యేడు ఇక్కడికొస్తుందా?" అని అడుగుతోంది.

అదే ప్రశ్న నాలుగైదు సార్లు అడిగిందావిడ. బలహీనంగా వినిపిస్తోన్న ఆమె స్వరాన్ని పట్టించుకున్న వారెవ్వరూ లేరు. ఒకరిద్దరికి ఆమె అభ్యర్థన వినిపిస్తున్నా అది తమకు 'అత్యనవసరమైన' విషయంగా భావించి మొహం తిప్పేసుకుంటున్నారు.

నాకూ వినిపిస్తోంది. కానీ నలభైయ్యేడు ఎక్కడాగుతుందో తెలీదు. పక్కనున్న 'సూటువాలా'ని "సార్, ఫార్టీసెవెన్‌ఎక్కడికొస్తుంది?" అనడిగాను. మేం నించున్న దానిని ఎదురుగా వున్న ప్లాట్‌ఫాం చూపించాడాయన.

వెంటనే ఆమె రెక్క పుచ్చుకొని "రండమ్మా నేను తీసుకెళ్తాను" అని నడిపించుకెళ్ళాను. ఆ ప్లాట్ ఫాం మీద ఓ స్తంభానికి ఆనుకుని నిలబడి "మంచిది బాబూ, ఇక నువ్వెళ్ళులే. బస్సొత్తే నేనెక్కగల్ను" అందావిడ.

సిక్స్టీన్ ఇంకా రాకపోవడంతో, అక్కడే ఆవిడకు కొంచెం దూరంలో నిలబడ్డాను. యథాలాపంగా నా దృష్టి మెయిన్ రోడ్ మీదికి పరుగు తీసింది. పంచె బిగించి కట్టిన ఒక ముసలాయన నెత్తిన మూటతో, చంకన చంటిబిడ్డతో వున్న ఇరవయ్యేళ్ళ యువతి చేతిని పట్టుకొని అయిదు నిముషాల పాటు అవస్థపడి, రోడ్డు దాటి మేం నించున్న దగ్గరకే వచ్చాడు.

మూట దించి, అమ్మాయిని కాపలా పెట్టి తలగుడ్డ విదిలించుకుంటూ ఒక బడాబాబు వద్దకు చేరి "కూకట పల్లి బస్సులెక్కడ ఆగుతాయి బాబూ?" అనడిగాడు. తెలుగువాడై పుట్టి తెలుగులో మాట్లాడితే తన పరువేం కాను అనుకున్నాడేమో, ఆయన ఇంగ్లీషులో సమాధానమిచ్చాడు స్టైల్‌గా, పెద్దాయన బుర్రగోక్కొని, మరో వ్యక్తి వద్ద కెళ్ళి అడిగాడు.

"ఇలా ఎడంచేతి పక్కనే నేరుగా వెళ్ళి, స్టేషన్ ఎదురుగా వున్న మెయిన్ రోడ్డులోంచి ఎడమవైపు తిరుగు. బాగా డౌన్‌గా వుంటుంది. అక్కడాగుతాయి" చెప్పాడాయన.

దానికా పెద్దాయన "బాబ్బాబు, మీకు పున్నెముంటాది గంట నించీ అక్కడకెల్తే, ఇక్కడికీ, ఇక్కడికెల్తే అక్కడికీ అని తిప్పుతా వుండారు. నెత్తిన మూట మాడు పగల గొడతంది. పసిపిల్ల తల్లి. సంటిపిల్ల ఏడుత్తుండాది. సావలేక సోతున్నాను. కాత్త మా ఎంట వచ్చి సూపిచ్చు బాబూ" అన్నారు బ్రతిమాలుతూ

"పోపోవయ్యా బాబూర, గొప్ప బేరం దొరికిందిలే. ఏదో చెప్పింది కాక, వచ్చి బస్సెక్కించాలా? ఇంకానయం, ఇంటిదాకా రమ్మన్నావు కాదు" అంటూ అతనక్కణ్నుంచీ తప్పుకున్నాడు.

ముసలాయన మరో ఇద్దర్ని బ్రతిమాలాడు. నిరాకరించారు. ఒక స్టూడెంటును మరీ మరీ వేడుకుంటుండగా అంధురాలు ఆ ముసలాయిన్ని పిలిచింది. వచ్చాడు.

"నేను చూపిస్తాను పద బాబూ" అంది కర్రతో తడిమి, మెట్లు దిగుతూ.

ఆ ముసలాయన సిగ్గుగా "వద్దులేమ్మా ఎట్టాగో ఎల్తాం. మళ్లీ మా మూలంగా నువ్వు శానా ఇబ్బంది పడి నడిసి రావాలి" అన్నాడు పశ్చాత్తాప పడుతున్నట్లుగా.

ఆమె పెద్దగా నవ్వింది. ఆ నవ్వులో వ్యంగ్యం లేదు. ఈ సమాజాన్ని క్షుణ్ణంగా చదివేశానన్న అహం లేదు.

చాలా మామూలుగా నవ్విందంతే!

"భలే వారండీ. నాకిది మామూలే. ఈ వీధులూ, ఈ కార్లూ, ఈ హడావుడీ అంతా నాకలవాటే! దాని గురించి మీకేం బాధ పడక్కర్లేదు. రండి వెళ్దాం" అంటూ సమాయత్తం చేసింది.

ఆయన మూట నెత్తిన పెట్టుకున్నాడు. అతని వెంటే ఆ అమ్మాయి, చంటిపిల్లతో!

మెటల్ డిటెక్టర్ లాంటి కర్రను పట్టుకొని అంధురాలు ముందు నడుస్తోంటే, వెనుక వారిద్దరూ అనుసరించారు. వారలా నడిచి వెళ్తున్న దృశ్యం ఏ చిత్రకారుడూ గీయలేని అద్భుత జీవన చిత్రంలా నా మనసులో ముద్రించుకు పోయింది.

అక్కడున్న అన్ని వందల మందిలో నాతో సహా అందరూ అంధులే, ఒక్కరు తప్ప!

●●●